


ఆ ఉత్తరం చదివిన విశ్వనాధంగారికి ఊసర క్షేత్రంలో బంగారు పంట పండినట్టయింది. ఆయన కళ్ళు ఆనందంతో మిలమిల మెరిసాయి. కాంతి నిండిన ఆ కళ్ళల్లో వర్షభాష్పాలు మొలిచాయి.

ఆ విషయం తన భార్య పార్వతమ్మకు ఎంత త్వరగా చెపుదామా అనిపించింది.

అదే సమయంలో పార్వతమ్మ గుడి నుంచి వచ్చింది.

"పార్వతీ! ఈ రోజు ఎంత శుభకరమైన దినమో తెలుసా! ఇన్నాళ్ళుగా మనం ఎదురు చూసినదీ, ఆశించినదీ, దేవుడు మనల్ని కరుణించినదీ యివాళే జరిగింది" ఆత్రుతతో అసలు విషయం చెప్పకుండా గుమ్మంలోనే నిలబెట్టేసిన భర్తవంక, అతని చేతిలో చివురుటాకులా వణుకుతున్న ఉత్తరాన్ని ఎగాదిగా చూసి— "ఇంతకీ ఏమిటైందిట?" అంది పార్వతమ్మ.

"మన సుజాతకు సంబంధం కుదిరింది. త్వరలో ముహూర్తాలు పెట్టించమని వ్రాసారు. నిజానికి ఎంత సంతోషంగా ఉందో తెలుసా?" అంటూ ఆనంద ప్రవాహంలో కొట్టుకుపోయారు విశ్వనాధంగారు.

"పోన్లెండి! భగవంతుడు ఇన్నాళ్ళకైనా మనమీద కరుణ చూపించాడు. జీవితంలో మనకి తీరవలసిన అడ్డంకులు, బాధ్యతలు, బరువులు ఈ పెళ్ళితో తీరిపోయినట్లే!" అంది గతంలో తాము అనుభవించిన కష్టాల పరంపరలను తలచుకుంటూ.

"కాని నేను ఆ రోజు... అదే సుజాత పెళ్ళి చూపులరోజు ఎంత కంగారుపడ్డానో తెలుసా! రంగాచారిగారు లాంఛనాల విషయంలో ఏదో నసుగుడు మొదలెడితే నాకు అనుమానం వేసింది." అన్నాడు ముఖాన పట్టిన చెమటలు తుడుచుకుంటూ!!

ఒక్కసారి పెళ్ళిచూపులరోజు తలపు కొచ్చింది పార్వతమ్మకు.

ఆ రోజు సుజాతను కుందనపు బొమ్మలా తయారుచేసి సశాస్త్రీయంగా పెళ్ళిచూపులు జరిపించారు. ఇరుపక్షాలవారు మాట్లాడుకున్నారు.

కానీ ఏ విషయం సరిగ్గా తేల్చకపోవడం— అబ్బాయి రాజేంద్ర ముఖంలో సంతోషఛాయలు ఏ మాత్రం కనిపించక పోవడం చూసే సరికి తను, తన భర్త ఎంత యిద్దైపోయారో!!

ఉత్తరం వ్రాస్తామని చెప్పి నిర్లిప్తంగా వెళ్లిపోతే ఎంత బెదిరిపోయారో!!

తలుచుకుంటేనే ఒక్కసారి ఒళ్ళు జలదరించింది ఆమెకు.

"ఇంతకీ సుజాత ఏదీ? దాని చెవిన కూడా ఈ శుభవార్త వెయ్యొద్దూ!" అని అంటూండగానే బైటనుంచి శంకరం, సుజాత వచ్చారు...

"ఎక్కడకు పోయార్రా! యిందాకట్నించి మీగురించి కళ్ళు కాయలుకాచేలా ఎదురు చూస్తున్నాం" అంది పార్వతమ్మ బిడ్డల వంక ఆప్యాయంగా చూస్తూ.

"నీ వంటింటి బిడ్డల్ని ఏదొంగా ఎత్తుకుపోలేదు కాని అసలు విషయం ఏమిటో చెప్పమ్మా! కంగారు పడక" అని జవాబిచ్చి సోఫాలో చతికిల పడ్డాడు శంకరం.

సుజాత కూడా ఏదో మేగజైన్ చూడటంలో నిమగ్నమైపోయింది. "అమ్మా! నువ్వు పెళ్లకూతురివి కాబోతున్నావమ్మా!" అంది పార్వతమ్మ.

సిగ్గుల మొగ్గైంది సుజాత. బుగ్గలు క్షణంలో ఎరుపెక్కాయి.

"ఒరే మొద్దూ! విన్నావా!... నీచెల్లిని వరించడానికి ఒక మగధీరుడు దొరికాడోయ్! ఇదిగో ఉత్తరం చదువు!" అంటూ శంకరం చెవిని సుతారంగా మెలివేసి చెప్పింది పార్వతమ్మ!

ఉత్తరం చదివి ఏమాత్రం సంతోషం కనపరచని కొడుకు వంక చూసిన పార్వతమ్మ, విశ్వనాధంగారల మనసులు క్షణంసేపు ఆందోళనతో నిండిపోయాయి.

"ఏంరా! అలాగైపోయావు, ఏం ఆ అబ్బాయిని నీకు తెలుసా? వ్యసన పరుడా?" వ్యధ, కంగారు... ఆతృత మొదలైనవన్ని చోటు చేసుకున్నాయి ఆయన కంఠంలో!

"అది కాదు నాన్నా! మనసుజాత విషయం వాళ్ళకు తెలుసా? తనలోని లోపాన్ని గుర్తించి మనస్ఫూర్తిగానే పెళ్ళికి ఒప్పుకున్నారా! చెప్పండి." —శంకరం పెద్ద మనిషిలా నిలదీసి అడుగుతూంటే బొమ్మల్లా నిరుత్తరులైపోయారు.

"బాబూ! ఎందుకదంతా!" అంది పార్వతమ్మ విసుగ్గా!

"కాదు మనలో ఓ లోపం ఉన్నప్పుడు దాన్ని ఎదుటి వాళ్లకు తెలియపరచకుండా వాళ్ల భవిష్యత్తుని బలి చేయడం మంచిది కాదు. అది ఘోరంకూడాను. అందుకే వాళ్లతో ఆ విషయం చెప్పడం మంచిది. లేకపోతే ఏనాటికైనా అది బయటపడుతుంది" అన్నాడు తీవ్రంగా శంకరం.

"ఏమిట్రా! నువ్వంటున్నది... నీకేమైనా పిచ్చిపట్టిందా! మన సుజాతను చూస్తే ఏ అవలక్షణాలు లేవే! యింతకీ లోపం ఏమిటో మాకు అర్ధం కావటంలేదు!" అన్నారు విశ్వనాధంగారు కొంచెం కటువుగా.

అలా అన్నప్పుడు ఆయన భృకుటి ముడిపడింది.

"నాన్నా! చిన్నతనంలోనే ఆ సంగతి నిలిచిపోయింది నాలో... అటువంటిది మీకు గుర్తులేదా! ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకోండి" అన్నాడు శంకరం.

వెంటనే కరిగిన గతం కళ్లముందు నిలిచింది ఆ దంపతులకు.

* * *

ప్రయాణ సౌకర్యాలు అంతగాలేని రోజులవి. రామ తీర్థం నుంచి విజయనగరం సినిమాల కెళ్ళాలంటే మైసూరెడ్లబండి పూయించుకునివాలుగైదు కుటుంబాల వాళ్ళు బయలుదేరే వారు...

సుజాత వ్యక్తురాలైన క్రొత్తలో ఒకసారి విశ్వనాధంగారితో సహా మొత్తం నాలుగు కుటుంబాల వాళ్ళు సినిమా ట్రిప్ వేసారు. అది వానాకాలం కావటం వలన నెల్లిమర్ల చంపావతీ యేరు వస్తోంది... విశ్వనాధంగారు యేటిలోంచి బండిని నడిపే సాహసం చెయ్యొద్దని చెప్తున్నా వినకుండా బండివాడు దింపాడు. బండి కుదుపులతో వెళ్తూంటే ఒడ్డునున్న సుజాత క్రిందకు తూలి పడిపోయింది. నీళ్ళు మింగేసింది. అందరూ గోలగోల పెట్టేసారు. బండివాడు ఒక్క ఉదుటన యేటిలోకి దిగి సుజాతను ఒడ్డుకు చేర్చి కడుపును, గుండెలను గట్టిగా నొక్కి నీళ్లు క్రక్కించాడు.

మొత్తానికి సుజాత బ్రతికింది.

కాని ఆరోజు మొదలు తరచు కడుపు నొప్పి రాసాగింది సుజాతకు. విశ్వనాధంగారు డాక్టరికి చూపిస్తే పిడుగులాంటి వార్త చెప్పాడు. "ఈ అమ్మాయి గర్భకోశం బద్దలైంది... అందువలన పెళ్లైనా పిల్లలు పుట్టే అవకాశం లేదు. ఆపరేషన్ల వల్ల సాధ్యం కాదది."

ఆ షాక్ నుంచి చానాళ్లవరకూ తేరుకోలేకపోయారు అంతా!

* * *

గతం నుంచి తేరుకుని కొడుకు వంక నిర్లిప్తంగా చూసారు విశ్వనాధంగారు.

"ఏం నాన్నా! మాట్లాడవేం! ఒకరికి అన్యాయం చేయటం మంచిదా? చెప్పండి! చెల్లాయికి పెళ్ళికావటం నాకు యిష్టమే! కాని నాలోని ఆదర్శం నా చేత యిలా మాట్లాడిస్తోంది" అన్నాడు శంకరం.

"ఆఁ చెప్పొచ్చావురా! బోడి ఆదర్శాలు... మనం యిన్నాళ్లు దానికి సంబంధాలు వెతికినా దొరకలేదు... పోనీ ఏదో ఇన్నాళ్లకు సంబంధం నిశ్చయమైందనుకుంటే నువ్విలా అడ్డుపుల్లలు వేస్తున్నావు? నీకన్నా వయసులోనూ, అనుభవంలోనూ చాలా పెద్దవాళ్లం మేం. నువ్వు మాకు నీతులు చెప్పనక్కర్లేదు. వంద అబద్ధాలైనా చెప్పి పెళ్ళిచెయ్యమన్నారు పూర్వీకులు... మరేం మాట్లాడకు... ... కుక్కిన పేనులా నోరు మూసుకుని పడుండు..." గట్టిగా హుంకరించారు ఆయన.

"ఛా! నా! మన సుజాత ఎంత అందంగా ఉంటుంది... ఎవరికీ తెలియని లోపం దానిది. అటువంటప్పుడు మనమే కోరి కొరివితో తల గోక్కుంటామా! చెప్పు!" సమాధాన పరుస్తూ అంది పార్వతమ్మ.

తల్లిదండ్రుల మాటల్లో కొంత వాస్తవం గోచరించినా శంకరంలోని అభ్యుదయ భావాలు అందుకు అంగీకరించలేదు. అందుకే ఏమీ మాటాడకుండా వీధిలోకి వెళ్ళిపోయాడు శంకరం. 'హమ్మయ్య' అని బరువుగా నిట్టూర్చి ముహూర్తం పెట్టించడానికి వీధిలోకి వెళ్ళిపోయారు విశ్వనాధంగారు.

* * *

## విజయ కేతనం

హలం —
మనిషి జీవనానికి ప్రధానం;
కలం —
జాతి మనుగడకు ఆయుధం;
బలం —
సమస్త దేశానికే సౌభాగ్యం....


- బండి లక్ష్మీనరసింహారెడ్డి

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్.
వివాహము వాయిదా వేయ నవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్ఖలనములకు ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు
రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి.
ఫోన్ : 3700 & 1010.



సినీతారలు
మీకు నచ్చే నలుగురి తారల సెక్సీ ఫొటోసెట్ 10 రూ.
మీరు మెచ్చే ఒక నటి.నటుడి ఫొటో సెట్ 5 రూ.
నటీనటుల అడ్రసులగల డైరీ 2రూ.
కావలసినవారు M.O. చేయండి.
వై.కె.మూర్తి,
జ్ఞానలవారివీధి, విజయవాడ-2.

సరికొత్త యవ్వనమునకు సంప్రదించండి
భారత ప్రఖ్యాత సెక్స్ స్పెషలిస్ట్ డా॥ రాయ్ (GOVT.REGD)
30 సంవత్సరముల అనుభవముతో, వ్యక్తిగత గుప్తరోగములకు, అసమానమైన, శాస్త్రీయమైన చికిత్స చేయుదురు. జీవితములో ఆరోగ్యమునకు, యవ్వనమునకు ఆధునిక విద్యుత్ పరికరములతో ఉత్తమ చికిత్స చేయుదురు.
Dr. RAI
(SEX SPECIALIST)
సమయం: ఉదయం: 8-00 గం॥ల నుండి 1-00 గం॥ వరకు
సాయంత్రం: 1-00 గం॥ల నుండి 8-30 గం॥ వరకు
* ఆదివారం సెలవు లేదు *
రాయ్ మెడికల్ హాల్
సెయింట్ మేరీస్ రోడ్, మనోహర్ టాకీస్ ఎదురుగా
సికింద్రాబాద్ PHONE: 76795



వెలువడినవి
డాక్టర్ ఎ. రాజకుమారి నవలలు :

| | |
|---|---|
| డాక్టర్ శారద | 11-00 |
| అపరాజిత | 15-00 |
| ప్రేమ క్షణికం – బ్రతుకు నూరేళ్లు | 16-50 |

(నవలలు కేవలం కాలక్షేపంకోసమే కాదు. ఎంతో కొంత విషయగ్రహింపు వుండాలని- మధ్యతరగతి సంసారాల ఇతివృత్తాన్నే కథా వస్తువుగా తీసుకుని అనితర సాధ్యంగా వ్రాసిన నవలలు)
త్వరలో
శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి నవలలు
ప్రేమ సింహాసనం 18-00 ♦ సీతాపతి 15-00
వివరాలకు :
క్వాలిటీ పబ్లిషర్స్,
రామమందిరం వీధి, విజయవాడ-520 002.

# లోపం

పెళ్ళి రోజు...!!

విశ్వనాథంగారిల్లు బంధుమిత్రులతో కోలాహలంగా – సందడిగా, పట్టుచీరల రెపరెపలతో, పసందైన బాజా భజంత్రీలతో నిండుగా కళకళలాడుతోంది.

ఓ వైపు మునుసిగ్గుల తెమ్మెరల్లా వధూవరుల ముఖాలు చూడ ముచ్చటగా ఉన్నాయి.

శంకరం పెళ్ళి వారికి కావలసినవాట్ని అందిస్తూ అటూ యిటూ హడావుడిగా తిరుగుతున్నాడు ప్రతివారినీ పలకరిస్తున్నాడు.

అదే సందర్భంలో శంకరం ఒక అమ్మాయిని చూడటం తటస్థించింది. విలువైన వజ్రాల్లా మెరిసే కళ్ళు, బాదంపళ్ళ లాంటి పెదాలు, ఎవరినైనా యిట్టే ఆకర్షించే తీరైన ముఖం కోటేరు ముక్కుతో అప్సరసలా ఉంది...

ఆ అమ్మాయి శంకరం హృదయకేన్వాసు పై ముద్రించుకు పోయింది.

ఇంతలో కూల్ డ్రింకులు పంపవలసిందని చెప్పగా శంకరం అందరికీ యిచ్చాడు. అలా యిస్తున్నప్పుడు కూడా శంకరందృష్టి ఆమె పైనే ఉంది కూల్ డ్రింకు యిస్తూ ఆమెను చూసి నవ్వి– "మీ పేరేమిటి?" అని అడిగాడు నవ్వేసి ఊరుకుంది.

దాన్ని గ్రీన్ సిగ్నల్‌గా భావించి యింకా ఆరాధించటం మొదలెట్టాడు అదే సమయంలో పెళ్ళిపందిరిలో వేణు అనే పాత మిత్రుడు కలిసాడు శంకరానికి.

"ఏరా శంకూ! వీడెలా ఊడిపడ్డాడు అని ఆశ్చర్యపోతున్నావు కదూ! నువ్వు ఇన్వైట్ చేయకపోయినా- పెళ్ళికొడుకు కూడా నాకు స్నేహితుడేన్లే!" అంటూ వెడ్డింగు పంపనందుకు కోపగించుకున్నాడు వేణు.

"అయినా నీ అడ్రసు నాకు తెలిసేడిసిందేమిటి! తెలిస్తే పెండ్లికి పిలవనంతటి మూర్ఖుడిని కానురోయ్." అంటూ చిలిపిగా డొక్కలో పొడిచాడు శంకరం.

ఎన్నో విషయాలు వాళ్ళ మధ్య దొర్లాయి.

ఆ సమయంలోనే తను ఆరాధిస్తున్న అమ్మాయిని చూపించి– ఆమె వివరాలు అడిగాడు శంకరం.

"ఆ అమ్మాయి పేరు అరుణ. బి.ఏ చదివింది పెళ్ళికొడుకు దగ్గర చుట్టాలే! నా కంతకన్నా వివరంగా తెలీదు అన్నట్టు

(61వ పేజీ చూడండి)

ఈ ఊరే!'' అంటూ తనకు తెలిసిన విష యాన్ని క్లుప్తంగా చెప్పాడు వేణు

ఎవరో పిలిస్తే వేణు వెళ్ళిపోయాడు.

శంకరం మనసు నిండా అరుణ నిండి పోయింది

* * *

కళ్ళు మూసినా తెరిచినా సరే శంకరానికి అరుణ ప్రతిబింబమే గోచరించేది ఆమె నెలాగైనా తన జీవిత భాగస్వామిని చేసుకోవాలనిపించేది అందుకే రోజూ అరుణ ఉండే వీధిలోకివెళ్ళి ఆమెని చూసి వస్తూండే వాడు

ఈ మధ్య శంకరం అదోలా ఉండటం గమనించిన పార్వతమ్మ– ''ఏంరా! అలా ఉన్నావ్!'' అని అడిగింది.

''అమ్మా! ఎన్నాళ్లనుంచో నేను ఒక విషయాన్ని మీకు చెపుదామని అనుకుంటున్నాను... నేను అరుణను ప్రేమించాను... ఆ అమ్మాయినే పెళ్లిచేసుకోవాలని నిశ్చయించుకున్నాను నా మనసు వేరొకరికి అర్పించలేను పెద్దవాళ్ళుకదా మీరు వెళ్లి మాట్లాడి రండి''' అన్నాడు భారంగా

## లోపం

[10వ పేజీ తరువాయి]

కణతలు రుద్దుకుంటూ శంకరం.

''ఒరే! నీకేమైనా బుద్ధి, జ్ఞానం ఉన్నాయా! ఆ అమ్మాయి మూగది...''

తల్లి మాటలకు నిర్ఘాంతపోయాడు శంకరం.

అరుణ మూగదా? భగవంతుడు ఎంత నిర్దయుడు. ?

అందమున్న వాళ్లకు అంతర్గతంగా ఏదో లోపాన్ని సృష్టిస్తాడు...? అయినా తను ప్రేమించిన అమ్మాయినే– పెళ్లి చేసుకునే టప్పుడు– ఆమెలో ఏ లోపం ఉంటేనేం?

''అమ్మా! అది దేవుడు సృష్టించిన లోపం! నా దృష్టిలో అది లోపంకాదు. నా కిష్టం కనుక నేను అరుణనే చేసుకుంటాను...'' అన్నాడు శంకరం దృఢ నిశ్చయంగా.

హతాశురాలైంది పార్వతమ్మ!!

తన గడప త్రొక్కబోయే కోడలు మూగదా! ఎంత అప్రదిష్ట... 'శివ శివా! ఎంతటి విపత్కర పరిస్థితిసృష్టించావు.??'

ఈ ఘోరాన్ని ఎలాగైనా ఆపాలి?

యింతలో భర్తవస్తే ఆ విషయాన్ని చెప్పింది.

శంకరం పై విశ్వనాథంగారు మండి పడ్డారు.

కాని తండ్రి మాటల్ని పట్టించుకోకుండా ''నాన్నా! అరుణ అందమైనది. చదువుకున్నది... నేనామెను ప్రేమించాను. అయితే ఆమెకు దేవుడు తీరని శాపాన్ని యిచ్చాడు. ప్రతీవారికీ ఏదో లోపం ఉండటం సహజం. కాని నేను ఆమె లోపాన్ని తెలిసే చేసుకుంటున్నాను. అటువంటప్పుడు మీరెందుకలా అడ్డుపెట్టాలని చూస్తారు. ఎవరెదురొచ్చినా సరే ఈ పెళ్లి ఆగదు'' అంటూ చరచరా వీధిలోకి వెళ్ళిపోయాడు శంకరం.

* * *

''బాబూ! నూటికో, కోటికో నీలాంటి ఆదర్శ పురుషులుంటారు. లోపాన్ని స్వయంగా చూసి చేసుకుంటున్న నిన్నెలా అభినందించాలో తెలీడం లేదు. అరుణ ఆకలైనా అడగలేని




తల వెంట్రుకలు రాలుటకు కారణము పేలు

పేలను, ఈరులను నశింపజేయుటకు కెన్‌జ, వాడండి. సువాసనతోకూడిన పేలనాశిని కెన్‌జ్ హెయిర్ ఆయిల్‌ను వాడి మీ కేశములను కాపాడుకొనండి.

కెన్‌జ్

పేలనాశిని మందు

దీనిలో ఈరులను నశింపజేయు బెన్‌జోకెయిన్ ఉన్నది.



నిర్భయముగా వాడుటకు వీలైనది.

PHARM PRODUCTS

ఫార్మ్ ప్రోడక్ట్స్

తంజావూరు-613 007 తమిళనాడు.

అన్ని జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు కావలెను.

Chhaya/PP/222

# విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

## 1983 నవలల పోటీ

ముగింపు తేదీ : 30, ఏప్రిల్

ఫలితాల ప్రకటన : 22, జూన్

మొదటి బహుమతి : రు. 4000

రెండవ బహుమతి : రు. 3000

మూడవ బహుమతి : రు. 2000

వివరాలకు :

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్ :: విజయవాడ-520 004.







## లోపం

అందాలబొమ్మ... దాన్ని ఎలా చూసుకుంటావో .. అంతా నీదే భారం...'' అని కళ్ళు తుడుచుకున్నారు అరుణ తండ్రి అవధాన్లుగారు

అరుణ మౌనంగా వింటు నిలుచుంది.

''ఏమండీ! మీ అమ్మాయి నన్ను మొదటి చూపులోనే ఆకర్షించింది. అందులోనూ ఒకే కులం కావటం మంచిదే అయింది. మూగదైనా మంచితనం ఉందని నాకు తెలుసు. కాని వివాహానికి మా తలిదండ్రులు అడ్డుపడుతున్నారు మీకు అభ్యంతరం లేకపోతే అరుణను రిజిస్టరు మ్యారేజి చేసుకుంటాను. మీరే సాక్షులుగా ఉంటారు...'' అని తన అభిప్రాయాన్ని విడమరచి చెప్పాడు శంకరం .

''బాబూ! మీవాళకు యిష్టం లేకుండా పెళ్ళి చేయడం అంత మంచిది కాదేమో !'' సంశయించారు అవధాను గారు

''పర్వాలేదండీ! మీకెందుకు భయం... అంతగా కాకపోతే వేరే కాపురం పెడ్తాం..'' అని సమాధాన పరిచాడు శంకరం... ...

ఆ రోజే మ్యారేజీ కోసం రిజిస్ట్రార్ ఆఫీసులో అప్లై చేసాడు.

* * *

నెల్లాళ్లకు అరుణతో శంకరానికి వివాహం జరిగిపోయింది

''ఒరే! ఆగక్కడ... నా యింట్లో అడుగుపెట్టే అధికారం నీకులేదు... మేం ఈ పెళ్ళికి ఇష్టపడలేదని చెప్పి నువ్విలా చేస్తావా? కన్నవాళ్ళ చచ్చారనుకున్నావా? సిగ్గులేదురా నీకు!! ఒక మూగపిల్లని వద్దంటున్నా వినిపించుకోకుండా చేసుకుని యింతకు తెగిస్తావా??'' అంటూ వీరావేశంతో ఊగిపోయారు విశ్వనాథంగారు.

అరుణ నేల చూపులు చూస్తూ నిలుచుంది.

శంకరం ఏ మాత్రం బెదరలేదు.

''నాన్నా! ఎందుకలా అరుస్తారు? యిప్పుడు నేనేం తప్పుచేసానని. నాకిష్టమైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను. అది మీకిష్టం లేదని నేను నా యిష్టాన్ని చంపేసుకోవాలా? చెప్పండి? అరుణ మూగతనాన్ని పెద్దలోపంగా ఎంచి యిలా మాటాడుతున్నారు కాని చెల్లాయి లోపాన్ని గురించి మీకు తెలిసినా మీరు దాన్ని బావగారికి తెలియకుండా కప్పిపుచ్చి ద్రోహం చెయ్యలేదా?

అప్పుడు మీకు లోపం కనిపించలేదా! యిప్పుడు ఎందుకలా అరుణ లోపాన్ని ఎత్తి చూపిస్తున్నారు. కూతురికో న్యాయం, కోడలకో న్యాయం! చాలా బాగుంది నాన్నా! మీలాంటి వాళ్ళు తమ లోపాన్ని కప్పిపుచ్చుకుని ఎదుటి వాళ్ల లోపాన్ని ఎత్తి చూపిస్తున్నారు!!

## లోపం

నాన్నా! స్వార్థంనిండిన సమాజం యిది. కాని ఆదర్శం అనేది యింకా చచ్చిపోలేదు... మీరు ఒకే కోణంలోంచి చూసే తత్వాన్ని విడిచిపెట్టి నిదానంగా ఆలోచించండి.

అప్పుడే నేను చేసింది మంచి పనో కాదో మీకే అర్థం అవుతుంది... ఇంతకన్నా చెప్పవలసింది లేదు..." అంటూ ధైర్యంగాలోనికి అడుగుపెట్టిన శంకరం, అరుణల వంక చూస్తూ స్థాణువుల్లా ఉండిపోయారు. విశ్వనాథం దంపతులు.